## క్లుప్తంగా

### 20 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్స్

నర్మెట : మండలంలోని మరియాపురంలో ఈనెల 20 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు గండిరామారం క్రికెట్ యూత్ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు, షీల్డ్ ప్రదానం చేయడం చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో 25 టీంలకు అవకా శం కల్పించనున్నామని, జిల్లా పరిధిలోని టీంలు తమ పేర్లను ఈనెల 18 లోగా నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు బొడికె వి నోద్ కుమార్ 789350088, కుమార్ 90007 45715 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

జనగామ రూరల్ : ఎండల తీవ్రత దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని మరిగడిలో ధాన్యం కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హమాలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హమాలీలు సాంబరాజు శివయ్య, అశోక్, మల్లేష్, చందు, కనకరాజు, సంపత్ కుమార్, శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, సుహాసిని, వెంకటలక్ష్మి, నరసయ్య, పాల్గొన్నారు

### మహిళలు ఉపాధిలో రాణించాలి



బచ్చన్నపేట : మహిళలు ఉపాధిలో రాణిస్తూ మరో పది మందికి జీవనోపాధి కల్పించే దిశగా ముందుకు వెళ్లాలని అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ పి.రజితరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సాల్వాపూర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పలువురు మహిళలకు కుట్టు శిక్షణ, మగ్గం వర్క్‌లపై శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన మహిళలకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో వీరికి వ్యక్తిగత రుణాలు అందించి వారి జీవనోపాధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ సందుల నర్సింహులు, అధ్యక్షురాలు పద్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

### అక్రమ అరెస్టులు సరికాదు


జనగామ రూరల్ : అందాల పోటీలు రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మహిళలను అరెస్ట్ చేయాడం సరికాదని ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు అన్నారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులను ఖండించాలని అందాల పోటీలు రద్దు చేయాలని పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో మోకు భవాని, శ్రీలత,ఎం జయ, మమత, వరలక్ష్మి, కమల, రజిత, శాంత, అంజమ్మ, సుజాత, కవిత, పాల్గొన్నారు.

### భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీగా భగవాన్‌రెడ్డి



చిల్పూరు : భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీగా పల్లగుట్ట గ్రామానికి చెందిన వంచ భగవాన్‌రెడ్డిని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు పల్లగుట్టలో సంఘం జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరి నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### బాలయేసు 'వైశాలీ' ప్రతిభ



దేవరుప్పుల : మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని తీగల కవిత–శ్రీనివాస్ కూతురు వైశాలీ ఇంటర్ బైపీసీలో 950 మార్కులు సాధించి, ఎంసెట్ 1029 స్టేట్ ర్యాంకు సాధించింది. స్టేట్ ర్యాంకు పొందడంపై పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైశాలీ మాట్లాడుతూ త్వరలో నీట్ ఫలితాల్లో సముచిత ర్యాంకుతో మెడికల్ సీటు పొందాలని ఆకాంక్షించారు. అలాగే ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో మెరుగైన ర్యాంకుల సాధించడంపై పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జనగామ–సూర్యాపేట రహదారిలో బాణసంచాకాల్చి సంబురాలు జరుపుకున్నారు.

# హమాలీ చార్జీలు మరిచిన ప్రభుత్వాలు

- ఎనిమిదేళ్లుగా రైతులే బరిస్తూ..
- ఒక్కో కేంద్రంలో క్వింటాకు రూ.60కి పైనే
- ప్రభుత్వమే చెల్లించాలని రైతుల డిమాండ్



కొనుగోలు కేంద్రంలో తూకం వేసి లారీల్లో లోడ్ చేస్తున్న హమాలీలు

లింగాలఘణపురం : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల చార్జీలను చెల్లించడం ఎనిమిదేళ్లుగా ప్రభుత్వాలు మరిచిపోయాయి. దీంతో రైతులే హమాలీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. దీంతో రైతుకు ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధర క్వింటాల్‌కు రూ.2,320లల్లో ఒక్కో కేంద్రంలో క్వింటాల్‌కు రూ.60ల వరకు హమాలీ ఖర్చులే పోతున్నాయి. 2017 వరకు క్వింటాల్‌కు హమాలీ ఖర్చులో కొంత రైతు భరిస్తే మరికొంత ప్రభుత్వం అందించేది. దీంతో కొంత రైతులకు మేలు జరిగేది. నేడు పెరుగుతున్న హమాలీ చార్జీలతో ఒక్కొక్క కేంద్రంలో ఒక్కో విధంగా ఒక కేంద్రంలో రూ.50 ఉంటే మరో కేంద్రంలో రూ.55, రూ.60లు కూడా హమాలీ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇలా రైతులు నష్టపోతున్నారు. వంద క్వింటాళ్ల పండించిన రైతు హమాలీ చార్జీలే ఏకంగా రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. గతంలో క్వింటాల్‌కు హమాలీ రూ.20 నుంచి రూ.25లు ఉన్నప్పుడు ప్రభుత్వం రూ.5 నుంచి రూ.6ల వరకు చెల్లించేది. దీంతో రైతులకు కొంత మేలు జరిగేది. ప్రస్తుతం పూర్తిగా రైతులే చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి గతంలో మాదిరిగా హమాలీ చార్జీల్లో కొంత భరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### హమాలీ చార్జీలే రూ.3,960 చెల్లించా



72 క్వింటాళ్ల ధాన్యం పండిస్తే క్వింటాల్‌కు రూ.2320 గిట్టుబాటు ధర లభించగా హమాలీ చార్జీలు రూ.3960లు చెల్లించాల్సి వచ్చింది. ఇందులో కొంత ప్రభుత్వం భరిస్తే మేలు జరుగుతుంది. గతంలో ఎంతో కొంత ప్రభుత్వాలు చెల్లించేదీ ఆరేడేళ్లుగా మరిచిపోయారు. ప్రభుత్వం భరిస్తే బాగుంటుంది. – అనిల్, లింగాలఘణపురం

### అది రాష్ట్ర పాలసీ.. అవకాశం వస్తే విన్నవిస్తాం

హమాలీల చార్జీల చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వ పాలసీ. గత కొన్నేళ్లుగా రావడం లేదు. రైతులే భరిస్తున్నారు. ఏమైనా అవకాశం వస్తే ప్రభుత్వానికి విన్నవిస్తాం. రైతులకు మేలు జరిగేందుకు చర్యలు తీసుకుంటాం. – వసంత, డీఆర్‌డీఓ, జనగామ

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్డీఓ డీఎస్ వెంకన్న



మాట్లాడుతున్న ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. భూభారతి చట్టం అమలు నేపథ్యంలో జిల్లాలో మొదటగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా వివిధ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్న క్రమంలో సోమవారం శివునిపల్లిలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సదస్సు నిర్వహణ తీరును పరిశీలించారు. సదస్సులో ఉన్న రెవెన్యూ అధికారులతో మాట్లాడి సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు తమ సమస్యలను తెలుపుతూ వాటికి సంబంధించిన ఆధారాలను కూడా దరఖాస్తులతో సమర్పించాలని, తద్వారా సమస్యలు సత్వరమే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు రశీదులు అందిస్తారని, రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్‌నాయక్, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ రాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు శ్రీకాంత్, సతీష్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్లులో సదస్సులు**

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను ఈనెల 13న ఉదయం 9 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్లులో నిర్వహించనున్నట్లు ఆర్‌డీఓ వెంకన్న తెలిపారు. ఈనెల 5 నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని, నేటి (మంగళవారం)తో మండల పరిధిలో సదస్సు ముగుస్తాయని తెలిపారు.

### 'అసైన్డ్ భూలబ్ధిదారులకు అన్యాయం చేయొద్దు..'

దేవరుప్పుల : గత ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ పట్టా భూలబ్ధిదారులకు ప్రస్తుత పాలకులు అభివృద్ధి పేరిట అన్యాయం చేయొద్దని బీ ఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాపాక శ్రీశైలం అన్నారు. సోమవారం మండలంలోని రంబోజీగూడెంలో 524, 525, 526, 527 సర్వే నంబరులో 48.11 ఎకరాల భూమిని 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుకొని మొన్నటి బీఆర్ఎస్ ప్రభుత్వం వరకూ మొత్తం 87 మందికి భూపంపిణీ చేసిందన్నారు. సాగుకు సరైన పరిస్థితులు లేక కొందరు రైతులు మోఖ మీదికి రాలేక పోయారన్నారు. ఇలాంటి క్రమంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లబ్ధిదారులకు ప్రత్యామ్నాయం చూపకుండా ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా డబుల్‌బెడ్ రూమ్‌లు, శ్మశాన వాటిక, హరితహారం వంటి నిర్మాణాలతో తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్ పేరిట మరికొంతమంది రైతులకు నామమాత్రపు పరిహారంతో చేతులు దులుపుకునే చర్యలు తగవన్నారు. భూనిర్వాసితులకు బదులుగా భూమి చూపించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ పాలకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గణేష్, యాదగిరి, మధు, నవీన్, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్య తీర్చాలి

- జనగామ డీపీఓ స్వరూపారాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ స్వరూపారాణి

పాలకుర్తి: మండుటెండల్లో తాగునీటి సమస్య లేకుండా పనులు చేయాలని జనగామ డీపీఓ స్వరూపారాణి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పాలకుర్తి, కొడకండ్ల మండలాలకు సంబంధించిన ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకుడు గుంతలు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. తాగునీటి సమస్య, ఎస్‌బీఎం పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో తడి,పొడి చెత్త సేకరణ జరగాలని కోరారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రవీందర్, కొడకండ్ల ఎంపీడీఓ ఇంద్ర, ఈజీఎస్ మంజుల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం**

రఘునాథపల్లి : మండలంలోని ఖిలాషాపూర్‌లో శ్రీ దుర్గామాత, శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవతల ఉత్సవాల ప్రారంభంలో భాగంగా సోమవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఇంటింటి నుంచి నీళ్ల బిందెలతో బొడ్రాయి వద్దకు వెళ్లి జలాభిషేకం చేసి మొక్కుకున్నారు. సాయంత్రం రేణుకా ఎల్లమ్మ తల్లికి పుట్ట కమ్ముట కార్యక్రమం నిర్వహించారు.

**సైన్యానికి హనుమాన్ స్వాముల మద్దతు**

స్టేషన్‌ఘన్‌పూర్ : భారత సైన్యానికి మేము సైతం మద్దతు అంటూ మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారులు సోమవారం జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ మద్దతు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ బెలిదె శంకర్‌స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భారత సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు.

**లక్ష్మీతండాలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు**

రఘునాథపల్లి: మండలంలోని లక్ష్మీతండాలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయించారని, సమగ్ర విచారణ చేపట్టి అర్హులకు మంజూరు చేయాలని పలువురు గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, తహసీల్దార్ ఎండీ మోహిన్ ముజ్తబలకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీకి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆర్థికంగా ఉన్న వారి కుటుంబ సభ్యుల పేర్లు ఎంపిక చేసుకున్నారని వినతిలో పేర్కొన్నారు.

**ఇంటినంబర్లు ఇవ్వాలి**

జనగామ రూరల్ : పట్టణంలోని మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నంబర్లతో పాటు మౌలిక వసతులు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మంచినీరు ఇచ్చి కరెంటు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలమ్మ నగర్ ఇందిరమ్మ లబ్ధిదారులు ప్లాట్ కలిగి ఇల్లు కట్టుకొని ఉన్న ప్రతీ ఒక్కరికి మున్సిపల్ ద్వారా మోటివేషన్ చేసి ఇంటి నంబర్లు ఇవ్వాలన్నారు.

**ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అవకతవకలపై ఫిర్యాదు**

దేవరుప్పుల : మండల కేంద్రంతో పాటు గొల్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అవకతవకలపై మండల పరిషత్‌తో పాటు కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గొల్లపల్లి వాసి సోమలింగం మాట్లాడుతూ పారదర్శకంగా పేదలకు ఇల్లు మంజూరీ చేయాల్సిన కమిటీల వైఖరితో అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేశారని ఆరోపించారు. ఏకపక్ష నిర్ణయంలా ఉన్న జాబితాపై ఉన్నతాధికారులు రీసర్వే చేయాలని కోరారు.

**పైలట్ గ్రామంలో అమలుకాని పథకాలు**



రఘునాథపల్లి: మండలానికొక గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి నూరుశాతం ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని గొప్పలు చెప్పుకున్నారని..ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. సోమవారం పైలట్ గ్రామంగా ఎంపికైన మండలంలోని కన్నాయపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రభుత్వ పథకాలు అందాయా ..? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ వై కుమార్ గౌడ్, మండల కోఆర్డినేటర్ ముసిపట్ల విజయ్, బండి కుమారస్వామి, ఆంజనేయులు, సంజీవరెడ్డి, గాలిరెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాస్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.లగర

**వైభవంగా స్వామివారి రథోత్సవం**



పాలకుర్తి టౌన్: వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున స్వామి ఉత్సవ మూర్తులతో గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా నుంచి ఆలయం వరకు రథోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి మంగళ హారతులతో దర్శించుకున్నారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



టాపర్ సాధికను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, చైర్మన్ ఝాన్సీరెడ్డి

కొడకండ్ల : అధికారం చేపట్టిన నాటి నుంచి విద్యాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పద్మశాలి మార్కండేయ భవనంలో నియోజకవర్గంలోని కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల, తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల్లో పదో తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన 143 మంది విద్యార్థులకు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించి నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పరీక్ష ఫలితాల్లో బాలుర కంటే బాలికలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా వచ్చే తన వేతనాన్ని అభివృద్ధికే వెచ్చిస్తానన్న హామీలో భాగంగా కంప్యూటర్లను కొనుగోలు చేసామన్నారు. పది రోజుల్లో తొర్రూరులో కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించి నిష్ణాతులైన ప్యాకల్టీలతో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తన అత్తమామలైన ఝాన్సీ రాజేందర్‌రెడ్డిలు ఏళ్ల నుంచే సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ట్రస్ట్ చైర్మన్ ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, చదువుతో పాటు విద్యార్థులకు ఆత్మ విశ్వాసం ముఖ్యం అన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్ లక్ష్యంతో ముందడుగు వేయాలని కోరారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో సేవా కార్యక్రమాలను ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నామని, 25 ఏళ్ల క్రితమే అమెరికాలో హెల్త్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్‌రావు, డీఈఓ బోజన్న, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**రైతుల సంక్షేమమే ధ్యేయం**

రైతుల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి రైతులతో మాట్లాడారు. మార్కెటింగ్ అధికారులు, మిల్లర్లతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే**

పాలకుర్తి టౌన్ : వేసవిలో విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నూతనంగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరగడంతో ఓవర్‌లోడ్ సమస్యలను తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ రాంబాబు, ఏఈ రణదీర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలి

- జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్

సాక్షి ఎఫెక్ట్..



ప్రమాదకరమైన మలుపును పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

బచ్చన్నపేట : మండల కేంద్రం నుంచి ఆలేరు పట్టణానికి వెళ్లే దారిలో గోపాల్‌నగర్ గ్రామం దాటిన తర్వాత పదిమోటల బావి వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపును జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ పరిశీలించారు. సోమవారం సాక్షిలో 'వారానికో ప్రమాదం' అనే కథనానికి స్పందించిన డీసీపీ ఆ మలుపును నర్మెట సీఐ అబ్బయ్యతో కలిసి పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా గుబురుగా ఉన్న చెట్లను తొలగించాలని అందుకు గానూ ఆర్ అండ్ బీ అధికారుల అనుమతులను తీసుకోవాలని అన్నారు. అలాగే ప్రమాదకరమైన మలుపు ఉన్న చోట హెచ్చరిక బోర్డులను రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే అక్కడ కల్వర్టుకు రేడియం స్టిక్కర్లు వేయాలని అవసరమైతే స్పీడ్ బ్రేకర్లను కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. గోపాల్‌నగర్‌లోని కేసీఆర్ చౌరస్తా వద్ద ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను వాహనదారులకు నిర్వహించాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి పలు సూచనలు తెలిపారు. ఆయన వెంట ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్, కానిస్టేబుళ్లు యాదగిరి, రాకేష్, విద్య, తిరుపతి, అనిల్ ఉన్నారు.

# మిల్లులకు తరలించేలా చర్యలు

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



చిల్పూరు: కృష్ణాజీగూడెంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

సాక్షి ఎఫెక్ట్..

చిల్పూరు : లారీల సమస్య కారణంగా కేంద్రాల నుంచి ధాన్యం తరలింపులో కొంత జాప్యం జరుగుతుందని ఇక అలా జరుగకుండా మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. 'సాక్షి'లో 'కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం' అనే శీర్షికన ప్రచురించగా సోమవారం ఆయన పల్లగుట్ట, చిల్పూరు, కృష్ణాజీగూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. లారీల సమస్య కారణంగా కొంత సమస్య తలెత్తిందని వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సరస్వతి, ఏఈఓ వినయ్‌కుమార్, యాకూబ్ తదితరులు ఉన్నారు.

**ధాన్యం కొనుగోళ్లు వేగవంతం జరగాలి**



పాలకుర్తి టౌన్ : కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పాలకుర్తి టౌన్: ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని గూడూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. కొనుగోలులో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం తరలించాలని, గన్ని బ్యాగ్‌లతో, రవాణాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరచారి, సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, సివిల్ సప్‌లై డీటీ దేవానాయక్, ఆర్‌ఐ రాకేష్, రైతులు పాల్గొన్నారు.

### 'కాంగ్రెస్‌కు సేవలందిస్తున్న దేవస్థాన చైర్మన్'



జనగామ : 48 ఏళ్లుగా పార్టీ సీనియర్ నాయకుడు, కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి గౌడ్ కాంగ్రెస్ జెండాను మోస్తూ, సేవలు అందిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం కుమారస్వామిగౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మూరి కేక్ కట్ తినిపించారు. కార్యక్రమంలో జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు, చేర్యాల మండల అధ్యక్షులు కొమ్ము రవి, మాజీ ఎంపీటీసీ కోట నాయక్ పాల్గొన్నారు.

### ఆలయానికి రేకుల వితరణ

బచ్చన్నపేట : మండలంలోని కేసిరెడ్డిపల్లి ఆంజనేయ స్వామి ఆలయానికి గ్రామవాసి దాత ఇమ్మడి అనిత–కృష్ణారెడ్డి దంపతులు రేకులను బహూకరించారు. సోమవారం ఆ రేకులను ఆ లయంలో బిగించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సా యం చేశామన్నారు. మరి కొంత మంది దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కా ర్యక్రమంలో నాయకులు గాలి తిరుపతి, మధు, తదితరులు పాల్గొన్నారు.

# ఈజీఎస్ పనులను వినియోగించుకోవాలి

- ఈజీఎస్ అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్‌రావు



మాట్లాడుతున్న ఏడీఆర్‌డీఓ చంద్రశేఖర్‌రావు

బచ్చన్నపేట : గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎక్కువ మంది కూలీలు వినియోగించుకోవాలని ఈజీఎస్ అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్‌రావు అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళలో కూలీలు పనులకు వెళ్లి ఎండలు ముదరక ముందే తిరిగి ఇంటికి రావాలన్నారు. పని ప్రదేశంలో కూలీల సౌకర్యార్థం అన్ని వసతులను కూడా కల్పించాలని, కొలతల ప్రకారం పనులను చేసేలా కూలీలకు అవగాహన కలిగించాలని తెలిపారు. గ్రామాల్లో రైతులకు అవసరం ఉన్న పనులకు ఆర్జీ పెట్టుకోవాలని సూచించాలన్నారు. కూలీలు మస్టర్‌లలో ప్రతి రోజు హాజరు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, ఏపీఓ కృష్ణ, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

# బాల్య దశలోనే సంస్కారం నేర్పించాలి



బాల సంస్కార శిక్షణలో మాట్లాడుతున్న అతిథులు

జనగామ: పిల్లలకు బాల్య దశలోనే సంస్కా రం నేర్పించాలి.. ఇందుకు బాల సంస్కార శిక్షణ ఉపయోగపడుతుందని ప్రముఖ కవి, అధ్యాపకులు గంగరాజు శ్రీనివాస్‌రావు, నిర్వాహకులు మోహనకృష్ణ భార్గవ అన్నారు. విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యాన పట్టణంలోని హనుమకొండ రోడ్డున ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బాల సంస్కార శిక్షణ తరగతులను సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ శిక్షణలో ఆధ్యాత్మిక, ధార్మిక, చారిత్రక అంశాలతో కూడిన అనేక శ్లోకాలు, స్తోత్రాలు, కీర్తనలు, సుభా షితాలు బోధించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతీ సంప్రదాయాల గురించి తెలియజేయడంతో పాటు హిందూ సమాజ చైతన్యం కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవాలయ గౌరవాధ్యక్షుడు గజ్జెల నర్సిరెడ్డి, చిలువేరు హర్షవర్ధన్, ఉల్లెంగుల రాజు, మైలారం శ్రీనివాస్, సాయికుమార్, కృష్ణమూర్తి, రాంబాబు, అంబటి బాలరాజు, ఇట్టబోయిన రాజు, అశోక్, అన్నెబోయిన, సత్యం తదితరులు పాల్గొన్నారు.